

కథా కౌముది

# గాయత్రి - పి.వి.ఆర్. రాజశేఖర్

**కారు వేగంగా** కదిలి వెళ్ళిపోతుంటే నిల్చుని నా వైపు చూస్తూ చెయ్యి ఊపుతున్న సరస్వతి మెల్ల మెల్లగా దూరమయ్యింది.

కళ్ళకి మనిషి దూరమయ్యింది గానీ మనసుకి ఆమె ఆలోచనలు దూరంకాలేదు. కారు సీట్లో అలాగే వెనక్కి వాలి కళ్ళు మూసుకుని కూర్చున్నాను. సరస్వతి చెప్పిన మాటలే ఇంకా చెవిలో మార్మ్రోగుతున్నాయి....

"పాపం" అనిపించింది. కాని ఏమి చేస్తాం! అది విధి రాత!

అంతే.....కొంతమంది విధినెదిరించి ఎదిగి గెలుస్తారు. కొంతమంది గెలవలేక విధికి బలైపోతారు.

నేరం ఒకరిది...శిక్ష మరొకరికి. ఎప్పటికీ ప్రకృతి చెప్పే తీర్పే ఇంత...!!

గడ్డిని మేక తింటుంది. మేకని పులి తింటుంది. అందులో తప్పు ఎవరిది అంటే ఎవరూ చెప్పలేరు. స్వార్థమే ప్రతి జీవికి అసలు ప్రకృతి నేర్పించే మొదటి పాఠం...!

అన్నిటికంటే తెలివైన వాడిని అనుకునే మనిషి మేధస్సుకి కూడా అందకుండా ప్రకృతి తనంతట తాను కొన్ని పనులు చేసుకుంటూ వెళ్ళిపోతుంది. అదే విధి....!

అందులో కొందరు గెలుస్తారు. కొందరు పావులై ఓడిపోతారు.

గెలుపోటములు పక్కన పెడితే ఇది అంతా ఒక ఆటే అనుకునేంత ఆలోచన, అనుభవం మనిషికి రావడానికి చాలా ఎదురు దెబ్బలు తినాలి.

అలా చాలా సేపు ఆలోచనలలో వున్న నాకు "సార్...! ఇల్లు వచ్చింది" అన్న పిలుపు వినపడేసరికి తెలివొచ్చింది. ఆలోచనల్లోంచి తేరుకుని కారు దిగి ఇంట్లోకి నడిచాను.

ఇంట్లోకి వచ్చి నన్ను చూసి శ్యామల "కొంచెం మంచి నీళ్ళు తెమ్మంటారా..?" అనడిగింది.

"వొద్దు" అనేసి తిన్నగా నడుచుకుంటూ డ్రాయింగ్ రూములోకి వెళ్ళిపోయాను.

నాకు ఏమాత్రం మనసు బాగాలేకపోయినా ఆ డ్రాయింగ్ రూములో కూర్చుంటాను. అక్కడ ఎన్నో వేల పుస్తకాలు వున్నాయి.

అందులోంచి చలం పుస్తకం ఒకటి తీసి చదవడం మొదలుపెట్టాను.

శ్యామల నన్ను దూరం నుంచి చూసి ఏమి అనకుండా వంటింటి లోకి వెళ్ళి ఒక కాఫీ చేసి తీసుకొచ్చి నేను కూర్చున్న టేబిల్ మీద పెట్టి నా పక్కనే వున్న వేరొక కుర్చీ లాగి కూర్చుంటూ "సరస్వతిని కలిసారా?" అనడిగింది.

పక్కనే వున్న కాఫీ చేతిలోకి తీసుకుని అవునన్నట్టు తలాడించాను.

"ఎలా వుంది...?" అనడిగింది.

అంతసేపటి మౌనాన్ని వీడి "బతికే వుంది." అన్నాను. కాసేపు మా మధ్య నిశ్శబ్దం అలముకుంది...

ఆలోచనల్లోంచి తేరుకుని కాసేపటి తరువాత "నిజం చెప్పాలంటే ఒక పదేళ్ళు వయసు మీద పడినట్టు వుంది. మొహం అంతా పీక్కు పోయింది" అన్నాను.

"మరి కొన్నాళ్ళు ఇక్కడికి రమ్మనలేకపోయారా? తనకీ ఆ ప్రదేశం మారితే కొంచెం ఆ ఆలోచనల్లోంచి బయటకి వచ్చే అవకాశం వుంటుంది కదా !" అనడిగింది శ్యామల.

"చెప్పి చూసాను. నవ్వి ఊరుకుంది" అన్నాను.

"అసలేమైంది? గాయత్రి ఎక్కడ వుందట...?" అనడిగింది శ్యామల.

●●●

ఇరవై ఏళ్ళ క్రితం శ్రీకాకుళం దగ్గర పని చేస్తున్నప్పటి నుంచి సరస్వతిని మాకు తెలుసు. ఆమె జీవితం ఏమీ పూలపాన్పు కాదు. ఎన్నో సమస్యలతో సతమతమయ్యింది, కష్టాలతో కాపురం చేసింది. కన్న తల్లిదండ్రి పదేళ్ళకే చనిపోతే అక్క గంగ, బావ నాగరాజుల దగ్గర పెరిగింది. అష్ట కష్టాల మధ్యన పెరిగిన సరస్వతి, పేరుకే సరస్వతి. కానీ చదువు ఏ మాత్రము అబ్బలేదు. బాగా పేదవాళ్ళు అవ్వడం వలన రోజు గడవాలి అంటే ఎక్కడో అక్కడ పని చెయ్యాల్సిందే. అందుకే సరస్వతిని చదివించే స్తోమత లేక వాళ్ళ అక్క గంగ తనని పనిలో కుదిర్చింది. వాళ్ళ సంపాదనతో పాటు సరస్వతి సంపాదన కూడా అంతతమాత్రమే అయినా వేన్నీళ్ళకి చన్నీళ్ళలా ఏదో పనికొచ్చేది. అలా మా ఇంట్లో కూడా పని చేస్తూ వుండేది.

ఇలా కొన్నేళ్ళు గడిచేసరికి సరస్వతి పెళ్ళీడుకొచ్చింది.

అక్కడ ఇక్కడా పని చేస్తూ చాలీచాలని బట్టలతో గడుపుతుంటే అభిమానం అడ్డు వచ్చేది ఆమెకి. ఇవన్నీ చూసిన గంగ ఒక దూరపు సంబంధం ఒకటి తెచ్చి ఆమెకి పెళ్ళి చేసింది. పెళ్ళంటే మొదట్లో చాలా సంబర పడింది సరస్వతి. పాపం అప్పుడైనా తన కష్టాలు తీరతాయేమోనని. కాని కష్టాలకి తనే పెర్మనెంట్ అడ్రస్ అయిపోతుందని ఆ పిచ్చి పిల్లకి తెలీదు పాపం అప్పుడు.

పెళ్ళైన మొదటిరోజు నుంచే ఆమెకి కష్టాలు ప్రారంభమయ్యాయి. కట్నాలు, లాంచనాలు తక్కువ చేశారంటూ నానా గొడవలు పెట్టి ఆమె భర్త, అత్తమామలు వేధించుకుని తినేవారు. అన్నింటినీ మౌనంగా భరిస్తూ ఇంటెడు చాకిరీ గొడ్డులాగా చేస్తూ సంసారం చేసేది. పైగా ఎవరితోనో సన్నిహితంగా మాట్లాడుతుండేసరికి అతనికి ఈమెకి సంబంధం అంటగట్టి పూర్తిస్థాయిలో వేధించడం మొదలు పెట్టారు. ఎన్ని అవమానాలు చేసినా, అనుమానంగా చూసిన ఆమె నోరు మెదిపేది కాదు. ఎందుకంటే అప్పటికి తను గర్భవతి. కొడుకో కూతురో పుడితే కనీసం ఆ రకంగానైనా తన భర్తని దారిలోకి తెచ్చుకోవచ్చు అనుకుందామె.

అయితే దేవుడు చాలా దుర్మార్గుడు. అందుకే ఆమె జీవితంతో ఇంకా ఆటలు ఆడుకున్నాడు.

పురిటికి పుట్టింటికి వచ్చిన సరస్వతిని చూడటానికి ఆమె భర్త అప్పుడప్పుడు మాత్రమే వచ్చేవాడు. కనీసం గర్భవతి అని కూడా చూడకుండా డబ్బులకోసం గొడవ పడేవాడు. పెళ్ళి చేసి పంపినా ఇంకా వాళ్ళకి ఈ దరిద్రం పోలేదు అన్నట్టు గంగ మాటలు విసిరేది.

ఆ మాటలు విని మౌనంగా ఏడవటం తప్ప సరస్వతి దగ్గర వేరే దారి లేకుండా పోయింది. ఎవరు ఎన్ని మాటలన్నాతనకు పుట్టబోయే బిడ్డ మీదే ఆశలు అన్ని పెట్టుకుని బతికింది.

కొన్నాళ్ళకి ఆమెకి కూతురు పుట్టింది. అప్పటివరకు సరస్వతినైనా చూడటానికి వచ్చిన ఆమె భర్త ఇక పూర్తిగా రావడం మానేశాడు. కూతురు పుట్టింది అనే వార్త ఆమె అత్తవారికి కరెంట్ షాక్ లాగా తగిలింది. కొడుకైతే ప్లస్, కూతురైతే మైనస్ అన్న భ్రమల్లో బ్రతికే వర్గం ఇంకా బతికే వున్నారు, వాళ్ళే తన జీవితానికి ఒక ప్రశ్న లాగా తయారవుతారని తెలియని సరస్వతి జీవితం పెనం

మీద నుంచి పొయ్యిలో పడినట్టు అయ్యింది. కూతురిని కన్న పాపానికి ఆమెని అత్తవారు పూర్తిగా వెలేసేశారు. ఇక ఈ లంపటాన్ని ఎలా వదిలించుకోవాలిరా భగవంతుడా అని ఆలోచించి

"ఆ పుట్టిన బిడ్డ తన బిడ్డ కాదు వేరెవరికో పుట్టింది" అంటూ ఆమె భర్త గొడవ చేసి, వేరొకరితో ఆమెకి అక్రమ సంబంధం వుంది అని చెప్పి సంసారాన్ని పంచాయితీకి తీసుకొచ్చాడు.

నిజాయితీని నిరూపించుకోడానికి ఆమె దగ్గర ఆధారాలు లేక పెద్దలందరి కాళ్ళు చేతులు పట్టుకొని "అభం శుభం తెలియని పసిపిల్లకి అన్యాయం చెయ్యద్దు" అని చెప్పి ఏడ్చి, పసిబిడ్డ మీద ప్రమాణం కూడా చేసి చెప్పింది.

కాని అక్కడ ప్రేమ, పాశం, న్యాయం కంటే అనుమానం, అన్యాయం, అధికారమే గెల్చాయి.

ఫలితంగా ఆమె ఓడిపోయింది.

సరస్వతికి ఇంకొకరికి అక్రమ సంబంధం వుంది అని ఆరోపించి, ప్రత్యక్ష సాక్షులు అంటూ దొంగ సాక్ష్యాలు పుట్టించేసరికి ఆ వూరి పెద్దలు అవినీతికి అమ్ముడుపోయి చెప్పిన తీర్పు, చేసిన న్యాయం ఒక ఆడపిల్ల కాపరాన్ని నిలబెట్టలేక ఆమె జీవితాన్ని నవ్వులపాలు చేసి సంసారాన్ని నిలువునా సమాధి చేసాయి.

కష్టాలు కన్నీళ్ళతో పాటు తండ్రి వదిలించుకున్న కన్న కూతురు కూడా తోడయ్యింది ఆమెకి. భూమి గుండ్రంగా వుంది అన్నట్టు సరస్వతి జీవితం తిరిగి పుట్టింటికి చేరింది.

కడుపులో పెట్టుకుని చూసుకోవలిసిన అక్క కూడా సూటిపోటి మాటలాడేసరికి అమాయకురాలైన సరస్వతికి ఏమి చెయ్యాలో పాలుపోయేది కాదు. ఏది ఏమైనా గాని కూతురిని పెంచాలి అన్న ధృఢ సంకల్పంతో మళ్ళీ ఈ ఇంట్లో ఆ ఇంట్లో పనులు చేస్తూ రోజులు గడిపేది. ఆమె కథ తెలిసిన వాళ్ళు చాలామంది సానుభూతి చూపించి పని ఇచ్చేవారు.

అలా మా ఇంట్లో ఆమె పనికి కుదిరింది సరస్వతి.

శ్యామలకి అన్ని విషయాల్లోనూ చేదోడు వాదోడుగా వుండేది. ఆమె పనితనం నచ్చి కొంచెం జీతం ఎక్కువ ఇచ్చేవాళ్ళం. మా ఇంట్లో పనిమనిషిలా కాకుండా సొంత మనిషిలా వుండేది. అందరి ఇళ్ళల్లో పని చేస్తూ ఆ పసిపిల్లకి గాయత్రి అని పేరు పెట్టుకుని రెక్కల కష్టంతో ఆ పిల్లని అల్లారుముద్దుగా పెంచుకుందామె. ఆ పసిపిల్ల మా ఇంట్లో కూడా అల్లరి చేస్తూ తిరిగేది. ఆ పిల్ల రోజు రోజుకి ఎదుగుతూ వుంటే దానికి మురిసిపోయి ఆ ఆనందంలో తన కష్టం మరిచిపోయేది. .

అయితే అసూయ ఆడదాని ఇంటిపేరేమో అన్నట్టు శ్యామలకి ఒకరోజు ఒక విషయం చెప్పింది సరస్వతి. ఆమె భర్త వేరే పెళ్ళి చేసుకున్నాడంట, ఆ చేసుకున్న ఆమెకి కొడుకు పుట్టాడంట.!.. ఆ విషయం విని నాకు నవ్వొచ్చింది. తనని కాదనుకున్నా ఇంకా భర్త గురించే ఆలోచిస్తోంది సరస్వతి.

కొన్నాళ్ళకి గాయత్రి పెరిగి పెద్దదైంది. దానితో పాటే సరస్వతి ఖర్చులు కూడా పెరిగాయి. ఇలా ఇళ్ళల్లో చేసే పనులతో పాటు వేరే పనులు చెయ్యకపోతే ఆ ఖర్చులు భరించడం కష్టం అని తెలుసుకున్న ఆమె బిల్డింగ్ కట్టడాలు చేసే పనులకి కూడా వెళ్ళేది.

తన ఒళ్ళు హూనమైపోతున్నా గాయత్రి భవిష్యత్తే తన గమ్యం అని కష్టపడేది. మంచిరోజులు ముందు వున్నాయని ఆశగా వుండేది.

కాని కష్టాలు పెర్మనెంట్ అడ్రస్‌గా తననే ఎంచుకున్నాయి అని ఒకరోజు ఆ సంఘటన జరిగేవరకు ఆమెకి తెలియలేదు.

ఈసారి కష్టం నాగరాజు రూపంలో వచ్చింది. కూలిపని చేసి బాగా అలిసిపోయి ఇంటికి వచ్చి నిద్రపోతున్న ఆమెకి తన మీదకి ఎవరో పడుతున్నట్టు అనిపించి కళ్ళు తెరిచి చూసేసరికి ఎదురుగా తన బావ నాగరాజు ఆమెని బలాత్కారం చెయ్యడానికి

సిద్ధపడుతున్నాడు. ఒక్కసారి భయం వేసి బలంగా అతనిని తోసేసింది. పూటుగా తాగి కామంతో కళ్ళు మూసుకుపోయి ఉన్నాడేమో ఆమె వెంటపడి చెరచబోయాడతను. ఆ పెనుగులాటలో నాగరాజుని ఆమె కొట్టేసరికి అతని తలకి బలంగా దెబ్బతగిలి మూర్ఛపోయాడు.

ఆ సంఘటన పెను తుఫానులాగా తాకిందామెని. తనని పెంచిపెద్ద చేసి తండ్రిలాగా పెళ్ళి చేసి పంపిన బావ తన మీద ఇలా అత్యాచారానికి ఒడికడతాడని ఊహించలేకపోయింది.

అతని మాట పెడచెవిన పెట్టి డబ్బుకోసం అడ్డదార్లు తొక్కుతూ వేరెవరితోనో గంగ తిరుగుతోంది అని తెలిసి ఆమెని ఏమి అనలేక తాగిన మైకంలో సరస్వతిని అత్యాచారం చెయ్యబోయాడు నాగరాజు.

ఆరోజు నుంచి ఆ ఇంట్లోకూడా ప్రశాంతత ఆమెకి కరువయ్యింది.

విషయం తెలిసిన గంగ కూడా తేలుకుట్టిన దొంగలా ఊరుకుంది. కాని నాగరాజు మాత్రం "మొగుడు కొట్టినందుకు కాదు తోడికోడలు నవ్వినందుకు" అన్నట్టు గంగ మీద కోపంతో సరస్వతి మీద కత్తులు నూరేవాడు.

కంచే చేను మేస్తే అన్నట్లయ్యింది సరస్వతి పరిస్థితి. పైకి ఈ బాధ చెప్పుకోలేక కుమిలిపోతుండేది. ఆమె సమస్య తెలుసుకుని అవసరమైన సహాయాన్ని అప్పుడప్పుడూ చేస్తూ ఓదార్చుతూ ఉండేవాడు తాపీ మేస్త్రీ సత్తిబాబు. సరస్వతి పనిచేసేది ఇతని దగ్గరే. అప్పుడప్పుడూ పనులు చూపిస్తూ ఆర్ధికంగా ఆమెకి సహాయం చేసేవాడు. ఆమె కష్టాలన్నీ వినేవాడు.

ఓదార్పు లోపాయికారీగా ఏదో ఒక అవసరంతో ముడిపడి వుంటుంది అని ఆమె తెలుసుకోలేకపోయింది పాపం.

నాగరాజు అత్యాచారం చేసిన తరవాత మానసికంగా సరస్వతి బాగా అలిసిపోయి ఏదో ఓదార్పు కోరుకుంది. ఆ ఓదార్పు సత్తిబాబు దగ్గరనుండి అందేసరికి అతనికి బాగా దగ్గరయ్యింది. శారీరకంగా తప్పు చేశాక అతనికి పెళ్ళి అయిపోయిందని ఆమెకి తెలిసొచ్చింది. ఇది ఆమెని చాలా ఇబ్బంది పెట్టింది. కాని సత్తిబాబు అతని భార్యతో సంతోషంగా లేనని, ఈమెతోనే సంతోషంగా వున్నానని చెప్పేసరికి పెళ్ళి చేసుకుంటాడేమోనని అనుకుంది. ఆమెని అనుభవించడానికి, ఆర్ధికంగా సహాయం చెయ్యడానికి వచ్చేవాడు తప్ప సమాజాన్ని ఎదిరించి తనని పెళ్ళి చేసుకోడానికి ముందుకి వచ్చేవాడు కాడతను. తనని పెళ్ళి చేసుకోవాలంటే అతను ఇంకో అమ్మాయికి అన్యాయం చెయ్యాలి అని ఆలోచించేంత తెలివితేటలు సరస్వతికి లేవు.

ఆమె స్వార్ధం ఆమెది పాపం!

ఈ విషయం కాస్త తెలిసిన గంగ ఆమె మీద చిందులు తొక్కి "ఒసేయ్ దొంగ ముండ ఎంతకి తెగించావే. డబ్బు రుచి బాగా మరిగావ్. ఇలాగె రేప్పొద్దున్న నా సంసారాన్ని కూలదోయడానికి కూడా సంశయించవ్....నా ఇంట్లో ఇక ఉండద్దు...పో" అంటూ వాగి ఆమెని ఇంట్లోంచి బయటకి గెంటేసింది.

అసలు పాపంలో నాగరాజు పాత్ర గురించి ఏమైనా తెలిస్తేనో లేదా నాగరాజు ఎందుకలా చేసాడో సరస్వతి చెపితేనో గంగ పరిస్థితి ఏమయ్యేదో.!!

భర్త వొదిలేసిన తను తప్పని పరిస్థితులలో మానసికంగా వేరొకడికి దగ్గరైతే, మరి భర్త ఉండగానే తను చేసే పని ఏంటి అని తిరగబడి తప్పొప్పులను చెప్పే ధైర్యం సరస్వతికి లేక, ఇంట్లోంచి బయటకి వచ్చి ఏడుస్తున్న ఆమెని సత్తిబాబు తిరిగి దగ్గరకి తీసుకుని ఆమెకొక ఇల్లు , సంసారం ఏర్పాటు చేసి తన అవసరాన్ని తీర్చుకునేవాడు.

అసలు మనిషి బ్రతుకు అనే నావ స్వార్ధం అనే చుక్కాని ఆధారంగా నడుస్తుంది. స్వార్ధమే అసలు మనిషి నిజస్వరూపం...తరవాతే మిగిలిన ధర్మాలు, న్యాయాలు పైకి వచ్చేది.....ఈ స్వార్ధం నైతిక విలువలని కూడా పరమపద సోపానపటం లో పాములా మింగేస్తుంది.

కనీసం పులిబోనులో బతికితే నక్కలు తనవైపు చూడవు అనుకుందో ఏమోమరి సరస్వతి సమాజాన్ని ఎదిరించి ధైర్యంగా సత్తిబాబుతో కాపురం చేసింది. 'ఎందుకిలా సరస్వతి ..?' అని అడిగితే మాత్రం "గాయత్రి భవిష్యత్తు కోసం" అనేది...

గాయత్రి ఈ విషయాలన్నీ చూసి అర్థం చేసుకోలేని చిన్న పిల్ల అనుకుందేమో అప్పుడు, గాయత్రే తన భవిష్యత్తుని మలుపు తిప్పబోతోంది అని ఊహించలేకపోయిందామె!

రెక్కలు ముక్కలు చేసుకుని గాయత్రి కోసం తన శరీరాన్ని, శక్తిని ధారపోసి డబ్బులు సంపాదించేది సరస్వతి.

చదువులేకపోవడం వల్లనే తన జీవితం అలా అయిపోయిందని గాయత్రిని మంచి స్కూల్‌లో జాయిన్‌చేసి, నలుగురిలో తనలాగా అవమానాలు పడకూడదు అని తను తిన్నాతినకపోయినా, కట్టుకున్నా లేకపోయినా గాయత్రికి ఏ లోటు రాకుండా పువ్వుల్లో పెట్టి చూసుకునేది.

ఒక్కమాటలో చెప్పాలి అంటే గాయత్రే తన గమనం, తన గమ్యం, తన భవిష్యత్తు... తన జీవితం

నాకు శ్రీకాకుళం నుండి ట్రాన్స్‌ఫర్ కావడంతో, మాతో పాటు సరస్వతిని వచ్చెయ్యమని శ్యామల అడిగింది. అయినా గాని "లేదమ్మగారు! ఇలా తిప్పితే గాయత్రి సదువు పాడైపోద్ది. నేను మీతో వచ్చేస్తానంటే మా మేస్త్రి ఊరుకోడు. అప్పుడప్పుడూ మీ దగ్గరికి వచ్చి వెళతాను" అని నవ్వుతూ, కళ్ళలో తన బాధనంతటిని పైకి కనపడనివ్వకుండా మమ్మల్ని సాగనంపింది.

మానసికంగా దగ్గరైన తనని ఒదులుకోవడం శ్యామలకి ఇష్టంలేకపోయినా వేరే దారిలేక సరే అని బయల్దేరాం.

మేము వెళ్ళిపోయిన తరవాత చాలా రోజులకి మా ఇంటికి ఒకసారి వచ్చి వెళ్ళింది. శ్యామలకి దూరం అయిన బాధ తన మాటల్లో తెలిసేది.

కొన్నాళ్ళకి గాయత్రి పెద్ద మనిషి అయిందని తెలిసి శ్యామల వెళ్ళి ఆర్థికంగా కూడా సహాయం చేసి వచ్చి సరస్వతి పరిస్థితి ఇప్పుడు బాగుంది అని చెప్పి సంతోష పడింది.

గాయత్రి కూడా బాగా చదువుకుంటోంది అని విని తనైనా సరస్వతి కష్టాలు తీరుస్తుంది అని అందరం సంతోషించాం.

ఆ తరవాత మేము పిల్లల చదువులు, పనులు ఒత్తిడిలో పడి సరస్వతి గురించి మరీ ఎక్కువగా ఆలోచించడం మానేశాం.

కొన్నాళ్ళ తరువాత ఎవరో ఒక వ్యక్తి ద్వారా విషయం తెలిసింది " గాయత్రి కనపడటం లేదని..."

మొదట కనిపించడం లేదు అనుకుని, కంగారుపడి పోలీసు స్టేషన్‌లో కూడా చెప్పి చూశారుట.

కానీ కాలేజిలో కనుక్కుంటే తెలిసింది. అసలు విషయం.

గా. య..త్రి...లే..చి..పో..యిం..ద.ని.

కాలేజికి వెళ్ళొస్తాను అని చెప్పి సరస్వతి ఇంట్లో లేని సమయం చూసుకుని గాయత్రి తన బట్టలన్నీ తీసుకుని ఎక్కడికో వెళ్ళిపోయిందట.

అతను గాయత్రి కోసం రోజూ కాలేజికి వచ్చేవాడట. రెండు మూడుసార్లు బైకు మీద కూడా తిప్పాడంట...!

ఏవో సినిమా కబుర్లు చెప్పేసరికి పాపం పిచ్చిపిల్ల దానిని ప్రేమనుకుని వాడిని నమ్మి, సరస్వతిని నట్టేట ముంచి వెళ్ళిపోయింది.

పూర్తిగా వాకబు చేస్తే తెలిసింది వాడిని పెళ్ళి చేసుకుని ఎక్కడో కాపురం కూడా పెట్టిందని.

ఇది సరస్వతి ఊహించని దెబ్బ!

ఎవరైతే ఇన్నాళ్ళు తన లోకం, సర్వస్వం అనుకుని రెక్కలు ముక్కలు చేసుకుందో ఆ గాయత్రే మోసం చేసింది...!

తనకి జీవితంలో జరిగిన మోసాలన్నిటిలోకి ఇదే పెద్ద మోసం...పెద్ద నమ్మక ద్రోహం....!

మోసం అంటే అదేకదా. నమ్మిన వాళ్ళని ముంచడం.! నమ్మనివాళ్ళని ముంచడం ఎలా సాధ్యపడుతుంది....?

ఎలా జరిగిందో ఎందుకు జరిగిందో ఎనాలిసిస్ చేసినా ఉపయోగంలేదక్కడ. ఎందుకంటే ఎప్పుడూ పరిస్థితులే చెడ్డవి.!

సరస్వతి సత్తిబాబుని ఎలా నమ్మిందో, అలాగే గాయత్రి కూడా ఇంకెవరినో నమ్మింది.

ఎక్కడ వుందో తెలుసుకోడానికి ఇద్దరు ముగ్గురిని కూడా పంపింది సరస్వతి. కానీ "నేను రాను, అక్కడ ఆ నరకంలో బతకలేను" అని చెప్పి "ఏమి తను మాత్రం తనకి నచ్చినోడితో తిరగాలేదా?" అని అడిగేసరికి అందరి నోర్లు మూత పడిపోయాయి.

ఒక్క సరస్వతిది తప్పు.... అదీ ఏడవటానికి మాత్రమే ..!

సరస్వతి నేర్పించిన చదువు గాయత్రికి బాగా పనికొచ్చింది.

చాలా రోజుల తరవాత నేను అటేపు వెళ్ళి సరస్వతిని కలిస్తే జరిగిందంతా చెప్పి "రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడి దానికోసం సంపాదించి, నేను తిన్నా తినక పోయినా దానిని జాగ్రత్తగా చూసుకుంటే అది నాకు చేసిన మరియాద ఇది బాబు.

నేను ఆ నరకంలో వుండలేను అన్నాదట. అంత పాపం నేను ఏటి చేశానో తెలియటంనేదు బాబు. 'అంటూ ఏడ్చి' తక్కువ కులమోడితో పోయింది బాబు... కనీసం ఇంకెవడైనా అయితే నేను కూడా వూరుకునేదానిని.." అంది.

నాకు ఎందుకో అప్రయత్నంగా నవ్వొచ్చింది. ఇంత బాధలో కూడా కులం ప్రసక్తి తెచ్చినందుకు.

" గాయత్రి ఎలా వుంది..?" అని అడిగాను

"నీల్లోసుకుంది బాబు. మొన్నా మధ్య ఎక్కడో కాలేజిలో కనపడితే చూశాను. బాగా చిక్కిపోయింది. ఈ సమయంలో నా దగ్గర వుంటే ఎలా చూసుకునేదానినో. ఎందుకో పలకరించడానికి మొహం చెల్లనేదు. వాళ్ళ స్నేహితులని అడిగితే వాడిని పెళ్ళి చేసుకుని తప్పు చేశాను అందట. తాగి వచ్చి కొడుతున్నడంట. మూడు నెలల్లో మోజు తీరిపోయుంటాది.." అంది అక్కసు అంతా తీర్చుకుంటూ..
చాలా బాధేసింది. తెలియని వయస్సులో చేసిన తప్పుకి శిక్షగా ఇంకో జీవికి జన్మనిస్తోంది గాయత్రి పాపం.

సత్తి బాబు కూడా సరస్వతిని వదిలేశాడట....అవసరం తీరిపోయిందనుకుంటా....!

"ఎన్నాళ్ళు ఇలా బాధపడుతూ ఇక్కడే వుంటావ్. అటేపు రాకూడదూ!? ఏదైనా పని చేస్తూనో లేదా మాకు సహాయం చేస్తూనో బతుకుదువు గాని" అన్నాను...

దానికి సమాధానంగా చిన్న నవ్వు నవ్వి "చూస్తాను బాబు.. నాకు మాత్రం ఎవరున్నారు? కానీ నెలలు నిండితే అయినా గాయత్రికి నేను గుర్తొస్తానేమో..! దానికేదో చేసేసి నా దారి నేను చూసుకుంటాను.." అంది

ఆమెలో మాతృత్వం ఇంకా గాయత్రి మీద పెంచుకున్న పాశాన్ని వదలటం లేదు..పాపం...!!

అంతే. ప్రకృతే మళ్ళీ గెలిచింది. దాని నుంచి ఎవరూ తప్పించుకోలేరు.

చేప పిల్ల పుట్టగానే ఈతకొడుతుంది. గుర్రం జీవితాంతం నిలబడే వుంటుంది. మేక ఎప్పుడూ బలైపోతూనే వుంటుంది. సరస్వతి కూడా అంతేనేమో..!!

ఇరవై ఏళ్ళ క్రితం పుట్టిన పసిగుడ్డు "గాయత్రే" సరస్వతి గమనం, గమ్యం ...అప్పటికీ...ఇప్పటికీ...!!

తెలిసినా తెలియక పోయినా సరస్వతి జీవితాన్ని గత ఇరవై ఏళ్ళుగా నడిపిస్తున్న వ్యసనం...మరేదో కాదు .. గాయత్రి!

ఒక్కోసారి రక్త సంబంధాలు కూడా వ్యసనాలు అయిపోతాయి. ఎందుకంటే వాటిని వదులుకోవడం కష్టం కాబట్టి. ఈ భవబంధాలు వదులుకోవాలంటే మనిషికి చాలా అనుభవం కావాలి. సరస్వతికి ఇంకా రాలేదు అది.!

చెప్పిదంతా విని "అంతే పాపం! దాని జీవితం ఎప్పుడూ కష్టాలతోనే గడిచింది. అసలు సుఖపడనే లేదు! పోన్లెండి తల్లిదండ్రులని పోలీసు స్టేషన్ల చుట్టూనో, కోర్టుల చుట్టూనో తిప్పేంత తెలివితేటలు గాయత్రికి రాలేదు. చదిచప్పుడు లేకుండా పెళ్ళి చేసుకుంది. లేకపోతే ఈ వార్త కూడా ఏదో ఒక పేపర్లో చదవాల్సి వచ్చేది." అంది శ్యామల నిట్టూరుస్తూ...

శ్యామల వివరణకి నవ్వొచ్చినా "గాయత్రి లాంటి వాళ్ళు సమాజంలో చాలా మంది వున్నారు" అనిపించింది...

ఏది ఏమైనా కాలమే గాయం చేస్తుంది, తిరిగి కాలమే మందు వేస్తుంది.

రోజులు మారతాయి ...మనుషులు మారతారు...కాని మనసుకి తగిలిన గాయం మానడానికి చాలా సమయం పడుతుంది. ఎందుకంటే మనసు అంటే మాటలు కాదుగా...!!

సరస్వతిని మోసం చేసిన ఆమె భర్త, గంగ, బావ నాగరాజు, సత్తిబాబు, గాయత్రి నాకళ్ళ ముందు మెదిలారు...ఆ క్షణంలో!!

**Click here to share your comments on this story**